సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024

చల్లంగా చూడు రాజన్నా..





వేములవాడ: రాజన్నను ఆదివారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఎండలను సైతం లెక్కచేయకుండా తమ ఇలవేల్పు కోసం భారీగా తరలివస్తున్నారు. జాతరగ్రౌండ్, ఆలయ పరిసరాలు, బద్దిపోచమ్మ, భీమన్నగుడి ప్రాంతాలు రద్దీగా మారాయి.

గరిష్ఠం/కనిష్ఠం
42.0/28.0

వాతావరణం

చాలా వరకు ఎండగా ఉంటుంది.
తీవ్ర ఉక్కపోత ఉంటుంది.
వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మే మొదటి వారంలో సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డి, సీఎం

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మే మొదటి వారంలో వస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్లలో జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. రాజన్నసిరిసిల్ల జిల్లాకు సీఎం హోదాలో మొదటిసారి నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈమేరకు మే నెల మొదటి వారంలో జరిగే సభకు సీఎం రేవంత్‌రెడ్డి సభకు కాంగ్రెస్ పార్టీ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

పశువులు, పక్షుల దాహం తీర్చండి



అనురాగ్ జయంతి, కలెక్టర్

సిరిసిల్ల: జిల్లాలో పశువులు, పక్షుల దాహం తీర్చేందుకు మనవంతు సహకారం అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందునా మూగజీవాలు చుక్క నీటి కోసం మైళ్ల దూరం ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయని, పక్షి జాతుల్లో కొన్ని అంతరించిపోవడానికి వేసవి కూడా ఒక కారణమని అధ్యయనాలు తెలిపాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పక్షులు పశువుల దాహం తీర్చడానికి మన వంతు సహకారం చేయాలని కోరారు. ఇంటి ప్రాంగణంలో గిన్నెల్లో నీళ్ల ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆహారం, నీళ్ల, షెల్టర్, వైద్య సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పశువులు, పక్షుల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావాలని కోరారు.

'మంకు' ఆశయాలు ముందుకు తీసుకెళ్తాం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



ధర్మారంలో మంకు రాజయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

కోనరావుపేట(వేములవాడ): విద్యాసంస్కర్త, దివంగత ఎంఈవో మంకు రాజయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు పేర్కొన్నారు. మండలంలోని ధర్మారంలో ఆదివారం నిర్వహించిన నాలుగో వర్ధంతి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన ఘనత మంకు రాజయ్యకే దక్కుతుందన్నారు. త్వరలో మంకు రాజయ్య చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లకావత్ శర్మన్‌నాయక్, నాయకులు తిరుపతి, గంగారాం, మధు, శిరీష, రవి పాల్గొన్నారు.

నేడు 'బయ్యర్ సెల్లర్' మీట్

సిరిసిల్ల: జిల్లా కేంద్రం శివనగర్‌లోని శివాలయంలో సోమవారం 'బయ్యర్–సెల్లర్' మీట్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పత్రగాట్ వస్త్ర వ్యాపారులు తమ ఆర్డర్లను స్థానిక వస్త్రోత్పత్తిదారులకు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఈమేరకు వారికి అవసరమైన వస్త్రాలను మ్యాక్స్‌సంఘాలు, ఎస్ఎస్ఐ యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేయించేందుకు ఈ మీట్ ఉపయోగపడనుంది. ఆసక్తి గల ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులు, మ్యాక్స్ సంఘాల ప్రతినిధులు హాజరై, వస్త్రోత్పత్తి ఆర్డర్లు పొందవచ్చని జౌళిశాఖ అధికారులు పేర్కొన్నారు.

ఉచిత సమ్మర్ కబడ్డీ క్యాంపు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా యువజన, క్రీడల అధికారి అజ్మీరా రాందాస్ ఆదివారం తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ ఏరియాలోని క్రీడారంగంలో ప్రతిభావంతులని గుర్తించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మే 1వ తేదీ నుంచి 31 వరకు సిరిసిల్ల మినీస్టేడియంలో 10 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వారికి ఒక బ్యాచ్, 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వారికి మరో బ్యాచ్‌గా బాలబాలికలకు, యువతీయువకులకు శిక్షణ ఇస్తామన్నారు. నిత్యం ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు కబడ్డీలో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకొని రావాలని కోరారు. వివరాలకు 99595 56017లో సంప్రదించాలని సూచించారు.

కడుపు కోతలే..



- ప్రసూతిలో ఆపరేషన్లకే మొగ్గు
- ప్రైవేట్‌లో ఇష్టారీతిగా సిజేరియన్లు
- ప్రభుత్వాస్పత్రుల్లో 70 శాతం..
- ప్రైవేటు ఆస్పత్రుల్లో 90 శాతం



మీరు చూస్తున్న ఈ ఫొటో సరిగ్గా పక్షం రోజుల క్రితం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో లేబర్ రూమ్‌ను వైద్యాధికారులు సీజ్ చేసిన దృశ్యం. సాధారణ కాన్పులే చేయాలని పదే..పదే చెబుతున్నా బేఖాతర్ చేయడంతో కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో సిరిసిల్ల, వేములవాడల్లోని మూడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో దాడులు చేశారు. 2020–24 కాలంలో నూరు శాతం సిజేరియన్లు చేసిన వేములవాడలోని వాసుదేవ ఆస్పత్రి, అమృత నర్సింగ్‌హోమ్, సిరిసిల్లలోని సరయు ఆస్పత్రుల్లో లేబర్‌రూమ్‌లను సీజ్ చేశారు. ఈ సంఘటనతోనే ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలకు సిజేరియన్లు చేస్తున్నట్లు అర్థమవుతుంది. అయితే నిబంధనలతో కూడిన ఆంక్షలతో ఇటీవల ఆయా ఆస్పత్రుల్లోని లేబర్‌రూమ్‌లను తెరిచారు.

ఏప్రిల్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు	
జిల్లాలో మొత్తం ప్రసవాలు	6,905
ప్రభుత్వ ఆస్పత్రుల్లో..	4,269
సిజేరియన్లు(ప్రభుత్వ)	2,994
నార్మల్ డెలివరీలు	1,275
ప్రైవేటులో డెలివరీలు	2,566
సిజేరియన్లు	2,326
నార్మల్	240

సిరిసిల్లటౌన్: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలకు వెళ్తే వైద్యులు సిజేరియన్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరుగుతున్నా అక్కడ కూడా ఆపరేషన్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు కాసుల కోసం ఆపరేషన్లకే మొగ్గుచూపుతున్నాయి. ఇటీవల జిల్లా వైద్యాధికారులు పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేయగా.. వంద శాతం ప్రసూతి ఆపరేషన్లు చేసినట్లు నిర్ధారణ కావడం ఈ విషయాన్ని బలపరుస్తుంది. నిబంధనలు పాటించకుండా వంద శాతం ప్రసూతి ఆపరేషన్లు చేసిన మూడు ఆస్పత్రుల్లోని లేబర్‌రూమ్‌లను పదిహేను రోజుల క్రితం సీజ్ చేయగా.. రెండు రోజుల క్రితం పలు ఆంక్షలు విధిస్తూ తెరిచారు.

ప్రైవేటులో కాసుల కక్కుర్తి

జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్లు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వస్తున్న నిండు గర్భిణీలను వెంటనే ఆపరేషన్లతో కాన్పు చేస్తున్నారు. వాస్తవానికి పురిటినొప్పులతో వచ్చే గర్భిణీకి సాధారణ ప్రసవం కోసం కొంత సమయం వేచి చూడాలి. కానీ ప్రైవేట్ ఆస్పత్రుల్లో అలా చేయడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వంద శాతం ప్రసూతి ఆపరేషన్లు చేస్తున్నట్లు ఇటీవల అధికారుల పరిశీలనలో తేలింది.

సర్కారు ఆస్పత్రుల్లో ఇలా..

ప్రసూతి వైద్యసేవల్లో జిల్లాలోని ప్రభుత్వ దవాఖానాలు అగ్రస్థానంలో నిలుస్తున్నాయి. సిరిసిల్లలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడలోని ఏరియా ఆస్పత్రుల్లో అమ్మలకు కార్పొరేట్‌కు మించిన వైద్యసేవలు అందుతున్నాయి. మండలాల్లోని పీహెచ్‌సీల్లోనూ ప్రసూతి వైద్యసేవలు అందుతున్నాయి. కుటుంబ సభ్యుల కోరిక మేరకు గతంలో సిజేరియన్లు చేసేవారు. కానీ ప్రభుత్వ ఆదేశాలు స్పష్టంగా ఉండడంతో చాలా రోజులుగా సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న సేవల గురించి తెలుసుకొని పక్క జిల్లాల నుంచి కూడా గర్భిణులు ప్రసవాల కోసం ఇక్కడికి వస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో గైనిక్, జనరల్, పీడియాట్రిక్స్ విభాగాల్లో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. అధునాతన టెక్నాలజీ మిషనరీతో మూడు ఆపరేషన్ థియేటర్లు, రూ.1.75కోట్లతో సీటీ స్కానింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

కారణాలెన్నో..

- పురిటినొప్పుల బాధ తెలియకుండా ఉండేందుకు పలువురు సిజేరియన్లకు ఆసక్తి చూపుతున్నారు.
- ముహూర్తం చూపించుకొని ఆపరేషన్ ద్వారా ఆ సమయానికి బిడ్డను కనాలని కోరుకోవడం.
- ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు అధిక బిల్లుల కోసం ఆపరేషన్లు చేస్తుండడం.

ఆస్పత్రిలో సేవలు భేష్



మాది హైదరాబాద్. మా ఆయన వెంకటేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తొమ్మిది నెలలు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో రెగ్యులర్ చెకప్ చేయించుకున్న. సిరిసిల్లలో నార్మల్ డెలివరీలు చేస్తున్నారని ఇక్కడికి వచ్చిన. ఉదయం, సాయంత్రం మిడ్‌వైఫ్‌లు వచ్చి ఎక్సర్‌సైజులు చేయించిండ్రు. నార్మల్ డెలివరీపై అవగాహన కల్పించారు. పండంటి పాపకు జన్మనిచ్చిన. సంతోషంగా ఉంది.

– గాజంగి తేజశ్వి

సాధారణ కాన్పులు చేయాలి



సాధారణ కాన్పులు చేయాలని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు ఆదేశాలు ఇచ్చాం. ఇటీవల మూడు ఆస్పత్రులపై చర్యలు తీసుకున్నాం. చాలా మంది వివిధ నమ్మకాలతో ఆపరేషన్లు చేయాలని అడుగుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో 70 శాతం, ప్రైవేటు ఆస్పత్రుల్లో 90 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి. సాధారణ ప్రసవాలపై ప్రజల్లో చైతన్యం రావాలి.

– డాక్టర్ సుమన్ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో

క్లిష్ట పరిస్థితుల్లోనే సిజేరియన్లు



జనరల్ ఆస్పత్రిలో విధిలేని సందర్భాల్లోనే సిజేరియన్లు చేయాల్సి వస్తుంది. మా వద్ద మిడ్‌వైఫ్‌లు నిత్యం గర్భిణీలతో ఎక్సర్‌సైజులు చేయిస్తూ, మంచి డైట్ ఇస్తున్నారు. ఆపరేషన్లు కోరిన వారిలోనూ మా వైద్యులు, సిబ్బంది ధైర్యాన్ని నింపి సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సాహిస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రసూతి వైద్యం అందుతుంది. సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యతనిస్తున్నాం.

– డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్



మాట్లాడుతున్న కేటీఆర్, వేదికపై నాయకులు మాధవి, తోట ఆగయ్య, చల్మెడ లక్ష్మీనరసింహారావు

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వేములవాడ: కాంగ్రెస్, బీజేపీలది మ్యాచ్ ఫిక్సింగ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వేములవాడలోని మహారాజ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద కండువా తీసి నిలబెడితే కనీసం పార్టీ కార్యకర్తలు కూడా గుర్తుపట్టలేరని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డివి చిల్లర మాటలు.. ఉద్దెర పనులని, ఇక సంక్షేమ పథకాల్లోనూ ఉద్దెర ఖాతాలేనన్నారు. 70 ఏళ్ల వయసులోనూ మన పార్టీ అధినేత కేసీఆర్ బస్సు యాత్రతో ప్రజల వద్దకొచ్చి ప్రచారం చేస్తున్నారని, మీరు రోజూ ఉదయం, సాయంత్రం మీ పరిధిలో తిరిగి ఓట్లు అడగాలని సూచించారు. ఊర్లలోని మన పంచాయితీలు పక్కన పెట్టి పార్టీని కాపాడుకోవాలని కోరారు. నిరుపేద యువతి వివాహానికి తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని, ఆది శ్రీనన్నకు వేములవాడలో బంగారం దుకాణాలు దొరుకుత లేవా అని చురకలంటించారు.

శ్రీరాముడు అందరివాడు

శ్రీరాముడు అందరివాడని.. లంగలు, దొంగలకు కాకుండా మంచి పనిచేసే వాళ్లకే అధికారం ఇవ్వాలని కోరారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ దేశం కోసం, ధర్మం కోసం అని మాట్లాడటం తప్ప ఈ ప్రాంతానికి ఐదు పైసల పని కూడా చేయలేదని విమర్శించారు. వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, ఇల్లందకుంట సీతారామస్వామి, సిరిసిల్ల మార్కండేయ ఆలయాలకు కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా తెచ్చాడా.. అని ప్రశ్నించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎవరెన్ని నిధులు తెచ్చారో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

మనకు ఉన్న శక్తి జాతీయ పార్టీలకు లేదు : వినోద్‌కుమార్

గ్రామం నుంచి పట్టణాల వరకు బీఆర్ఎస్ పార్టీకి ఉన్న శక్తి, క్యాడర్ జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు లేదని కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రానికి గులాబీ జెండా అవసరముందన్నారు. తమిళనాడు ఓటర్ల కోసం గోదావరి జలాలను అక్కడికి తరలించే కుట్ర జరుగుతోందన్నారు. దీన్ని అడ్డుకునే శక్తి గులాబీ పార్టీకి మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఎన్నికల ఇన్‌చార్జి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, నాయకులు తుల ఉమ, రవీందర్ సింగ్, ఏనుగు మనోహర్‌రెడ్డి, హరిచరణ్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికులను ఆదుకుంటాం

సిరిసిల్ల: రగుడులో దహనమైన తాటి, ఈతవనాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు ఆదివారం పరిశీలించారు. తాటి, ఈత చెట్లు కాలిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గీతకార్మికులకు ఉపాధినిచ్చే ఈత, తాటి వనాన్ని దహనం చేయడం దారుణమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. తుల ఉమ, తోట ఆగయ్య, గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- బీజేపీకి బుద్ధి చెప్పాలి
- బీఆర్ఎస్ పని అయిపోయింది
- బండి సంజయ్ ఐదేళ్లలో చేసిందేమీ లేదు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



దేవునితండాలో ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం, దేశంలో అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండలం దేవునితండా, సనుగుల, రామారావుపల్లె, కిష్టంపేటల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పసిపిల్లలు తాగే పాలపై జీఎస్టీ విధించిన బీజేపీ మళ్లీ ఓటేసి మోసపోవద్దని కోరారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఎంపీగా బండి సంజయ్ చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీలను అమలు చేశామన్నారు. గ్రామీణులకు ఉపాధిని చూపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జాతీయ ఉపాధిహామీ పథకాన్ని తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధి కూలీల వేతనం రూ.400 చెల్లిస్తామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు. ఆ పార్టీ అభ్యర్థి గతంలో ఐదేళ్లు ఎంపీగా ఉండి ఏం అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. కేసీఆర్‌కు పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని ప్రజలు బస్సు యాత్ర చేపడితే నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా రాజేందర్‌రావు గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ నాగంకుమార్, ఎంపీటీసీ మ్యాకల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీలు రావు.. వడ్లు పోవు

- లారీల కొరతతో పేరుకుపోతున్న ధాన్యం
- నెల రోజులు గడిచినా కాంటాలు పెట్టని వైనం
- ధాన్యం దిగుబడి అంచనా 3.93 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు చేసింది 1.23 లక్షల మెట్రిక్ టన్నులు
- కేంద్రాల్లోనే రైతుల పడిగాపులు



ఇతను చందుర్తి మండలం బండపల్లికి చెందిన రైతు గడ్డం సుధాకర్‌రెడ్డి. తనకున్న ఆరు ఎకరాల్లో వరిపంట వేశాడు. పొలం కోసి నెల రోజులు గడుస్తోంది. తేమ వచ్చి 20 రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో ధాన్యం తూకం వేయడం లేదు. నెల రోజులుగా కేంద్రం చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.



కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన తూకం వేసిన ధాన్యం బస్తాలు

చందుర్తి(వేములవాడ): యాసంగి సీజన్‌లో వచ్చిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. పంటను కోసి నెల రోజులు గడుస్తున్నా కేంద్రంలోనే ధాన్యం కుప్పలుగా ఉండడం.. లారీలు రాక తూకం వేయకపోవడంతో రైతులు నిత్యం కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. దళారులకు అమ్మొద్దని ప్రచారం చేస్తున్న అధికారులు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేయించడంతో విఫలమవుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 258 కేంద్రాలు

రైతులు పండించిన పంటను విక్రయించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే సగానికి పైగా కేంద్రాల్లో ధాన్యం లారీల కొరతతో తూకం వేయడం లేదు.



కవర్లు కప్పి ఉంచిన ధాన్యం రాశులు

రైసుమిల్లులు అందుబాటులో ఉన్నా లారీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే మిల్లులకు వెళ్లిన లారీల్లోని ధాన్యం అన్‌లోడ్ కాకపోవడంతో అవి అక్కడే నిలిచిపోయాయి. మళ్లీ కొత్తగా లారీలు రావడం లేదు. జిల్లా అధికారులు మిల్లులపై దృష్టి పెట్టి ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లక్ష్యానికి దూరంగానే..

జిల్లా వ్యాప్తంగా రైతులు సాగుచేసిన 181 లక్షల ఎకరాల్లో 3.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా 1.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇంకా 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించినట్లు తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో 11,030 మెట్రిక్ టన్నుల ధాన్యం కాంటా వేసినా లారీల కొరతతో బస్తాలు అక్కడే పేరుకుపోయాయి.

తూకం వేస్తలేరు



మూడెకరాల్లో వరి పంట వేసిన. దాదాపు 85 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. పొలం కోసి 20 రోజులు గడుస్తోంది. తేమశాతం వచ్చి 15 రోజులు అవుతోంది. అప్పటి నుంచి కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచిన. లారీలు వస్త లేవని తూకం వేస్త లేరు. మద్దతు ధర కోసం కేంద్రంలో ధాన్యం పోసి ఇబ్బంది పడుతున్నాం.

– మర్రి తిరుపతి, చందుర్తి

పంట కోసి నెల రోజులైంది



ఎనిమిదెకరాల్లో పంట సాగు చేసిన. పంట కోసి 32 రోజులు గడుస్తోంది. వడ్లలో తేమశాతం వచ్చి 20 రోజులు గడిచింది. ఇప్పటి వరకు ధాన్యం తూకం వేయడం లేదు. నాతోపాటు కోసిన రైతులు వ్యాపారులకు 20 రోజుల కిందనే క్వింటాల్‌కు రూ.2100కు అమ్ముకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేవు. మా వడ్లు ఎప్పుడు పోతాయో తెలియడం లేదు.

– మర్రి రాజు, చందుర్తి

రెండు రోజుల్లో పరిష్కారం



స్థానికంగా లారీల కొరత ఉండడంతో పక్క జిల్లాల నుంచి తెప్పించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. సోమవారం వరకు లారీల కొరత తీరుతుంది. రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం తరలింపును వేగవంతం చేస్తాం. ఇప్పటి వరకు రైతులకు ఇబ్బందులు లేకుండా సాధ్యమైనంత వరకు లారీలను ఏర్పాటు చేయిస్తున్నాం.

– శ్రీవర్ధన్, సీఈవో, సనుగుల సింగిల్‌విండో

గీతకార్మికులకు పరిహారం అందిస్తాం

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



రగుడు శివారులో కాలిన తాటి, ఈత వనాన్ని పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల: గీతకార్మికులకు నష్ట పరిహారం అందించి ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రగుడు వద్ద కాలిపోయిన తాటి, ఈత వనాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గీతకార్మికులు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం తాటి, ఈత వనాలను నరికి వేస్తున్నారని మహేందర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, పార్టీ సీనియర్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, గడ్డం నర్సయ్య, తిరుపతిరెడ్డి, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, కాముని నళినీకాంత్, గుండ్లపల్లి గౌతమ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అంజన్నకు భక్తుడి భూ విరాళం


కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి భూమి విరాళంగా ఇచ్చేందుకు ఆదివారం ఓ భక్తుడు ముందుకు వచ్చాడు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కప్పెర బాపురెడ్డి గ్రామంలోని తన 2.20 ఎకరాల భూమిని కొండగట్టు ఆలయానికి విరాళంగా ఇస్తానని, ఆలయ సూపరింటెండెంట్ సునీల్‌కు సంబంధిత పాస్‌బుక్, పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఈవో చంద్రశేఖర్‌తో మాట్లాడి త్వరలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

జగిత్యాల జిల్లాలో భానుడి ప్రతాపం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. వెల్గటూర్‌లో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోగా, ఇబ్రహీంపట్నం గోదూర్‌లో 44.9, ధర్మపురి మండలం జైనాలో 44.5, బీర్‌పూర్ మండలం కొల్వాయి, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 43.9 డిగ్రీల సెల్సియస్ చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనాయి. కథలాపూర్‌లో 43.7, బుగ్గారం మండలం సిరికొండలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనాయి.

కరీంనగర్ డీఈవోకు షోకాజ్ నోటీస్

కరీంనగర్: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ అక్రమ బదిలీకి పాల్పడిన కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావుపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో వికాస్‌రాజ్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈనెల 20న డీఈవో వ్యవహరించిన తీరుపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాలు.. కరీంనగర్‌రూరల్ మండలం నగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాస్‌ను ఎస్సెస్సీ పరీక్షలో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహించలేదనే కారణంతో మార్చి 19న పాఠశాల విధుల నుంచి డీఈవో సస్పెండ్ చేశారు. అనంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా ఆ ఉద్యోగిని వీణవంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునర్నియామకం చేస్తూ ఈనెల 8న ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉండగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా పనిచేస్తున్న ఒక ఉద్యోగి సస్పెన్షన్, పునర్నియామకం ఎలక్షన్ కమిషన్ మార్గ నిర్దేశాలకు విరుద్ధంగా జరిగిందని డీటీఎఫ్ ఆరోపిస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘం డీఈవోకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీంతో ఇప్పటికే అనేక వివాదాల్లో చిక్కుకొని ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఈవో వ్యవహారంపై ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

నివేశ్‌కు కన్నీటి వీడ్కోలు

హుజూరాబాద్: అమెరికాలో గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముక్క నివేశ్ (20) అంత్యక్రియలు హుజూరాబాద్‌లో ఆదివారం జరిగాయి. ప్రమాదం జరిగిన వారం రోజులకు మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. నివేశ్ మృతదేహాన్ని చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు నివేశ్ మృతదేహానికి నివాళి అర్పించారు.

సెలవులొచ్చాయ్ జాగ్రత్త

- 'నాలుగు రోజుల క్రితం కోరుట్ల పట్టణం వెంకటసాయి నగర్‌లో ఓ వృద్ధురాలి మెడ నుంచి మోటార్‌సైకిల్‌పై మాస్క్ ధరించి వచ్చిన యువకులు రెండు తులాల చైన్ లాక్కెళ్లారు'.
- 'గురువారం మెట్‌పల్లిలో మండలం వెల్లుల్ల గ్రామంలో దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి ఐదున్నర తులాల బంగారం, వెండి, రూ.42వేల నగదు దోచుకెళ్లారు'.
- 'శుక్రవారం రాత్రి కోరుట్ల మండలం అయిలాపూర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. తాళాలు పగులగొట్టి సుమారు తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు'.
- 'జగిత్యాల జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో శుక్రవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇండ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులకొట్టి సుమారు రూ.60వేలు ఎత్తుకెళ్లారు'.

- ఇళ్లకు తాళాలు వేసి టూర్లకు వెళ్తున్నారా..?
- ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..
- జిల్లాలో వేసవి చోరీల ముఠా సంచారం..?
- అప్రమత్తమైన పోలీసులు.. పెరిగిన నిఘా

కోరుట్ల: జగిత్యాల జిల్లాలో వారం వ్యవధిలో వరుస చోరీలు చోటుచేసుకున్నాయి. నాలుగు చోరీల ఘటనలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒక్కసారిగా పెట్రోలింగ్ పెంచడంతో పాటు రోజూ పట్టణాలు, మండలాల సరిహద్దుల్లో నాకాబందీ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వివరాలు ఆరా తీస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లపై కన్ను..

ఏటా వేసవిలో పిల్లలకు సెలవులు ఉండడంతో చాలా మంది వివాహాది శుభకార్యాలు, పుణ్యక్షేత్రాల సందర్శన, విహారయాత్రలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ఇండ్లకు తాళాలు వేసి రోజుల తరబడి టూర్లకు వెళ్లడంతో దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం చిక్కుతోంది. గత ఐదారేళ్లుగా వేసవిలో ఇండ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోతుండటంతో వేసవి రాగానే పోలీసు శాఖ అవసరమైన ముందు జాగ్రత్తలు చేపడుతున్నా అక్కడక్కడా చోరీలు జరుగుతున్నాయి. ఈ వేసవిలో పాఠశాలలకు సెలవులు ఇచ్చి వారం గడవక ముందే తాళాలు వేసి ఉన్న ఇండ్లలో చోరీలు మొదలయ్యాయి. జగిత్యాల జిల్లాలో తాళం వేసి ఉన్న ఇండ్లపై ఒకట్రెండు రోజులు నిఘా పెట్టి ఆ తర్వాత తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే దొంగల ముఠా సంచరిస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచడంతో పాటు ఇదివరకు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడిన పాత నేరస్తుల వివరాలు సేకరించి వారు ఎక్కడెక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారన్న అంశంపై లోతుగా విచారణ సాగిస్తున్నట్లు సమాచారం.


ఇటీవల మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో ఓ ఇంట్లో వస్తువులను చిందరవందర పడేసిన దొంగలు

జాగ్రత్త పడితే మేలు..

- వేసవిలో ఇండ్లకు తాళాలు వేసి టూర్లకు, ఫంక్షన్లకు వెళ్లేవారికి పోలీసులు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు.
- ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచకపోవడం ఉత్తమం. బంధువులు లేదా తెలిసిన వారి వద్ద వాటిని ఉంచి వెళ్తే పెద్ద నష్టం ఉండదు. బ్యాంకు లాకర్లలో ఉంచితే మేలు.
- ఇండ్లు విడిచిన నాలుగైదు రోజుల పాటు దూరంగా ఉండే పరిస్థితి ఉంటే పోలీసులకు తమ చిరునామా వివరాలు ఇవ్వాలి. ఇంటికి ఎదురుగా ఉన్న తలుపులకు కాకుండా పక్కన ఉండే ద్వారాలకు తాళాలు వేయడం మంచిది. రోడ్డుపై సంచరించే వారికి ఎదురుగా తాళాలు వేసి కనిపిస్తే చోరీలకు ఆస్కారం ఉంటుంది. ఒకవేళ ఎదురుగా ఉన్న తలుపుకు తాళాలు వేయాల్సి వస్తే కర్టెన్ వేయాలి.
- ఇంట్లో సెక్యూరిటీ అలారం లేదా మోషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకుంటే మంచిది. మోటార్‌సైకిళ్లను ఇంటి ఆవరణలో ఉంచి తాళాలు వేయాలి. ఇంట్లో సీసీ కెమెరాలను ఆన్‌లో ఉంచి వెళ్లాలి. తరచూ వాటిని సెల్‌ఫోన్‌లో గమనిస్తూ ఉండాలి. ఇంట్లో లేకున్నా కొన్ని గదుల లైట్లు వేసి ఉంచాలి.

అవసరమైన చర్యలు చేపట్టాం



వేసవిలో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడే ముఠాలను పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. ఇప్పటికే రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచడంతో బ్లూకోల్ట్స్ పహారా పెంచినం. రోజూ నాకాబందీ చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. ఇళ్లకు తాళాలు వేసేవారు సమాచారం ఇచ్చి పోలీసులు సూచించిన మేరకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తుల సంచరిస్తే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలి.

– ఉమామహేశ్వర్‌రావు, డీఎస్పీ, మెట్‌పల్లి

అస్తమించిన కార్మిక నేస్తం

- అనారోగ్యంతో కన్నుమూసిన కార్మిక పక్షపాతి సామల మల్లేశం
- జీవితకాలం ప్రజా పోరాటాలకు అంకితమైన నేత
- నివాళి అర్పించిన కేటీఆర్, వినోద్‌కుమార్, కేకే మహేందర్‌రెడ్డి, కమ్యూనిస్టులు

సిరిసిల్ల: జీవితకాలం ప్రజాపోరాటలకు అంకితమై, కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి ఉద్యమించిన యోధుడు, కార్మిక పక్షపాతి, సీపీఐ నాయకుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం (78) అస్తమించారు. సిరిసిల్ల పట్టణం బద్దం ఎల్లారెడ్డినగర్‌కు చెందిన మల్లేశం కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించారు. ఐదు దశాబ్దాలుగా ఆయన బీడీ, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలపై పోరాటం సాగించారు. కార్మిక ఉద్యమాల్లో కీలక భూమిక పోషించిన మల్లేశం సిరిసిల్ల కార్మిక క్షేత్రంలో పేదలకు భూమి పట్టాలు ఇప్పించారు. సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు సహచరుడిగా పని చేశారు. సుభాష్‌నగర్‌లో కార్మిక భవన్ నిర్మాణం, కమ్యూనిస్ట్ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లోని ఆయన ఇంట్లోనే తుది శ్వాసను విడిచారు. ఆయనకు భార్య శ్యామల, కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆయన మృతదేహంపై ఎర్రజెండా కప్పి.. కామ్రేడ్ సామల మల్లేశం ఆశయాలు కొనసాగిస్తామంటూ.. కార్మికుల నినాదాల మధ్య .. కన్నీటి నివాళితో ఆయన అంత్యక్రియలు సిరిసిల్లలో నిర్వహించారు.

ప్రముఖుల నివాళి

సామల మల్లేశం అస్తమించారని తెలిసి సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ నాయకులు తోట ఆగయ్య, గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, వైద్యశివప్రసాద్, కాముని వనిత, తిరుపతిరెడ్డి, అడ్వకేట్ శాంతిప్రకాశ్‌శుక్లా, కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు మంద్రి వెంకటస్వామి, గుంటి వేణు, పంతం రవి, కడారి రాములు, అజ్జ వేణు, సోమ నాగరాజు, మణికంఠరెడ్డి, సుతారి రాములు, కోడం రమణ, ఎల్లారెడ్డి తదితర నాయకులు నివాళి అర్పించారు.


సామల మల్లేశం(ఫైల్)

కార్మిక లోకానికి తీరని లోటు

కరీంనగర్: సీనియర్ నాయకుడు, కార్మిక ఉద్యమ నేత సామల మల్లేశం అకాల మరణం సీపీఐకి, కార్మిక లోకానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద్రి వెంకటస్వామి ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నాడు పార్టీ నిర్మాణంలో చెన్నమనేని రాజేశ్వర్‌రావుతో కలిసి పనిచేశారని, ఆ ప్రాంతంలో అనేక కార్మిక సంఘాలను నెలకొల్పి కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో బద్దం ఎల్లారెడ్డి పేరున ఒక కాలనీ ఏర్పాటు చేసి అనేక మంది పేదలకు ఇండ్లు నిర్మించిన మహనీయుడని కొనియాడారు. ఆయన మృతి పట్ల సీపీఐ కరీంనగర్ జిల్లా సమితి పక్షాన సంతాపం ప్రకటించారు.

విధుల్లో చేరిన నెల రోజులకే..

- రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి దుర్మరణం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కొడుకు జీవితం బాగుండాలని తను అన్‌ఫిట్ అయి ఉద్యోగంలో చేర్పించిన నెల రోజులకే కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన ఒక్కగానొక్క కొడుకు సింగరేణి ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా ఉంటాడని భావించిన ఆ తండ్రి ఆశలు అడియాశలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీ టీ2–187 క్వార్టర్‌లో నివాసముంటున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పెర్క శంకర్‌కు ముగ్గురు కూతుర్లు, కుమారుడు పెర్క హేమంత్(22) సంతానం. హేమంత్ ట్రెనింగ్ పూర్తి చేసుకుని ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనిలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం డ్యూటీ నుంచి వచ్చి ఇంట్లో ఉండగా, అతడి స్నేహితులు రావడంతో బయటకు వెళ్లాడు. అనంతరం అర్ధరాత్రి తన స్నేహితుడు రోహిత్ హైదరాబాద్ వెళ్తాననడంతో అతడిని షిర్కె బస్‌స్టాప్ వద్ద బస్సు ఎక్కించేందుకు.. మరో స్నేహితుడు మణికంఠతో కలిసి ద్విచక్రవాహనంపై అతడి వద్దకు బయలుదేరారు. సంతోష్‌నగర్ ఏరియాలోని సులభ్‌కాంప్లెక్స్ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన కరెంట్ స్తంభానికి ఢీకొనడంతో హేమంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మణికంఠకు తీవ్రగాయాలు కాగా, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 108లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.


హేమంత్(ఫైల్)

వాహన తనిఖీల్లో మద్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేట రోడ్డులో ఆదివారం ఉదయం పట్టణ ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా అంతర్గాం గ్రామానికి చెందిన షేర్ కిషన్ వద్ద రూ.13,200 విలువైన 12.60 లీటర్ల మద్యం పట్టుకుని కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చెర్లపల్లె గ్రామానికి చెందిన బండారి రాజిరెడ్డి తన ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న రూ.3,800 విలువైన 3.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే కొత్తబస్టాండ్‌లో పట్టణ ఎస్ఐ మన్మథరావు వాహనాల తనిఖీ చేపట్టగా టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన అనంతుల వెంకటి తన ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న రూ.6,376 విలువైన 10 లీటర్ల మద్యం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు..

- డిచ్‌పల్లి వద్ద జరిగిన ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో విషాదం నింపింది. శుభకార్యానికి వెళ్తున్న క్రమంలో భార్య మృతిచెందగా, భర్తకు తీవ్రగాయాలైనాయి. వివరాలు.. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మట్ట సురేశ్‌రెడ్డి, దీప్తి (45) దంపతులు కూతురు సమీక్షతో కలిసి బతుకుదెరువు రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. నిర్మల్ జిల్లాలో బంధువుల ఇంట్లో ఆడెల్లి పోచమ్మ బోనాల పండుగ ఉండడంతో ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి కారులో భార్యాభర్తలు బయలుదేరారు. డిచ్‌పల్లి వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడడంతో దీప్తి ఘటన స్థలంలోనే మృతిచెందింది. సురేశ్ రెడ్డి తీవ్ర గాయాలకు గురికాగా, ప్రాణప్రాయం లేదని వైద్యులు తెలిపారు. తల్లి మరణవార్త విన్న కూతురు సమీక్ష కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. రాచర్లబొప్పాపూర్‌లోని బంధువులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.


సురేశ్‌రెడ్డి–దీప్తి దంపతులు

శతాధిక వృద్ధురాలి కన్నుమూత

ఎలిగేడు(పెద్దపల్లి): నర్సాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బుర్ర రాజమ్మ ఆదివారం ఉదయం కన్నుమూసింది. రాజమ్మ వయసు 100 ఏళ్ల వయసుపైబడి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఆమెకు కోడలు బుర్ర భాగ్యమ్మ, మనుమలు ఉన్నారు.


బుర్ర రాజమ్మ(ఫైల్)

స్వగ్రామానికి మృతదేహం

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మెహమ్మద్ నబి (55) గత నెలలో సౌదీలో ప్రమాదవశాత్తు మృతిచెందగా, అతడి మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. స్థానికుల వివరాలు.. మెహమ్మద్ నబి కొన్నేళ్లుగా బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లి వస్తున్నాడు. గత నెలలో ఓ కంపెనీలో పని చేస్తుండగా పొక్లెయిన్ యాక్సిడెంట్ కావటంతో తీవ్రగాయాలైనాయి. తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మార్చి 30న మృతిచెందాడు. గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ఉచిత అంబులెన్స్ ద్వారా ఎన్నారై డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సహకారంతో మృతదేహాన్ని మాదాపూర్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

గుండెపోటుతో బీజేపీ నాయకుడి మృతి

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఆది కేశవరావు(51) శనివారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతిచెందాడు. గోదావరిఖనిలో జరిగిన పార్టీ సమావేశానికి హాజరైన ఆయనకు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పితో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేశవరావు విద్యార్థి దశనుంచి బీజేపీలో చేరి దాదాపు 30 ఏళ్లకు పైగా పనిచేశారు. ఆదివారం కనగర్తిలో జరిగిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య పాల్గొని పాడె మోశారు. చాలా ఏళ్లుగా కరీంనగర్‌లో నివాసముంటూ, అందరితో కలివిడిగా ఉండే కేశవరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మండల, గ్రామ స్థాయి బీజేపీ నాయకులు అంత్యక్రియల్లో పాల్గొని కంటతడిపెట్టారు. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య సుమలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


ఆది కేశవరావు(ఫైల్)

క్రేన్ బావిలో పడి మహిళ..

వేములవాడరూరల్: పూడిక తీసేందుకు వినియోగించే క్రేన్ ప్రమాదవశాత్తు బావిలో పడిన ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఆదివారం ఫాజుల్‌నగర్‌కు చెందిన దండుగుల మల్లవ్వ (70), ఆమె కుమారుడు కొమురయ్య, కోడలు గంగమణి, మరో వ్యక్తి మేడుదుల దేవయ్యలో కలిసి పూడికతీత పని చేస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడింది. ఆ సమయంలో క్రేన్ నడుపుతున్న మల్లవ్వ కూడా బావిలో పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతి తెలిపారు.


మల్లవ్వ మృతదేహం

చెరువులో మునిగి యువకుడు..

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బానోతు అనిల్ (26) ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మృతిచెందాడు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. మతి స్థిమితం సరిగా లేని అనిల్ శనివారం ఇంటి నుంచి బొమ్మారెడ్డిపల్లి వైపు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం సాయంత్రం ధర్మారం శివారులోని ఊర చెరువులో అతడి మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు నీటిలో పడి మరణించి ఉండవచ్చని అనిల్ తల్లి చిన్నమ్మ ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అనిల్ (ఫైల్)

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

కమాన్‌పూర్(మంథని): మండలంలోని మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి పోలీస్‌స్టేషన్ వెళ్లే దారిలో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. స్థానికుల వివరాలు.. కమాన్‌పూర్‌కు చెందిన మైనొద్దీన్ ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో గాయపడ్డాడు. అలాగే యైటింక్లయిన్ కాలనీకి చెందిన శ్రీనివాస్, అతడి భార్య, కుమారుడు స్కూటీపై వస్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో ముగ్గురికి గాయాలైనాయి. రోడ్డు కుంగిపోయి, గుంతలు పడడంతో నిమిషాల వ్యవధిలో రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురైనాయి. రోజూ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల పోలీస్, రెవెన్యూ ఉద్యోగులు సైతం ప్రమాదాలకు గురయ్యారని స్థానికులు తెలిపారు. కొద్దిరోజుల క్రితం రహదారి విస్తరణ చేపట్టగా, పనులు నాసిరకంగా చేయడంతో రోడ్డు కుంగి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు, పేర్కొంటున్నారు.


గాయపడిన మైనొద్దీన్



గాయపడిన మహిళ, ఆమె కుమారుడు

'బై బ్యాక్ పద్ధతి'లో సజ్జ సాగు

- క్వింటాల్‌కు రూ.7వేల చొప్పున విక్రయించేలా ఒప్పందం

జగిత్యాల అగ్రికల్చర్: వేసవి సీజన్‌లో జగిత్యాల జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నువ్వులు, మొక్కజొన్న, పెసర, కంది పంటలకు ప్రత్యామ్నాయంగా సజ్జ సాగు చేస్తూ రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. సజ్జ పంటను విక్రయించేందుకు నేరుగా ప్రైవేట్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. వేసవిలో జిల్లాలో అనువైన వాతావరణ పరిస్థితులు ఉండటంతో సజ్జను విత్తనోత్పత్తిగా పలు కార్పొరేట్ కంపెనీలు ఇక్కడి రైతుల చేత ఉత్పత్తి చేయిస్తున్నాయి.

ధర ఆశాజనకంగా ఉండటంతో..

విత్తనోత్పత్తి చేసిన రైతులకు ప్రైవేట్ కంపెనీలు క్వింటాల్‌కు రూ.7 వేల వరకు ఇస్తున్నాయి. కంపెనీలే విత్తనాలు ఇవ్వడం, పంట పండిన తర్వాత బై బ్యాక్ పద్ధతిలో ఆ పంటను కొనుగోలు చేయడం రైతులకు కలిసివస్తుంది. జిల్లాలో అనువైన వాతావరణం ఉండటంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటి వరకు వరి, ఆవాల పంటలో విత్తనోత్పత్తి చేయించగా, తాజాగా సజ్జలో చేయిస్తున్నాయి. అలాగే రైతులు ఎక్కువగా సాగు చేసే వరి, మక్క, పత్తి, కంది, పెసర వంటి పంటలకే ప్రభుత్వ మద్దతు ధర ఉండగా, మిగతావాటికి లేదు. దీంతో రైతులు ఏదైనా కొత్త పంట సాగు చేస్తే, ఆయా పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చే వరకు ఏ ధర ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో, పంటకు ముందే ఫలానా ధర చెల్లిస్తామని కంపెనీలు ముందుకు రావడంతో రైతులు సజ్జ వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు తక్కువ కాలంలో పెద్దగా ఖర్చు లేకుండా పంట చేతికి అందుతుండటంతో ఈ పంట వైపు దృష్టి పెడుతున్నారు.


మెట్‌పల్లి ప్రాంతంలో సాగవుతున్న సజ్జ పంట

పదివేల ఎకరాల్లో..

జిల్లాలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్ ప్రాంతాల్లో ఎక్కువగా, జగిత్యాల, మేడిపల్లి, రాయికల్ ప్రాంతాల్లో మోస్తరుగా జిల్లా మొత్తంగా దాదాపు 10 వేల ఎకరాల్లో రైతులు బై బ్యాక్ పద్ధతిన సజ్జను సాగు చేశారు. కాగా జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలు వేస్తే అడవి పందులు, కోతులు, రామచిలుకలు తీవ్ర నష్టం చేస్తున్నాయి. వీటికి ప్రత్యామ్నాయ పంటగా రైతులు సజ్జ సాగు చేస్తున్నారు. ఐదారు నీటి తడులు ఇస్తే సరిపోతుండటం, పెద్దగా ఎరువులు వేసే అవకాశం లేకపోవడంతో పాటు పంట 85–90 రోజుల్లోనే చేతికి వస్తుంది.

ఎకరాకు కిలో విత్తనం

ప్రైవేట్ కంపెనీలే విత్తనాలు కిలోకు రూ.800 చొప్పున సరఫరా చేస్తున్నాయి. ఎకరాకు కిలో విత్తనాలు అవసరమవుతాయి. ఆడ, మగ విత్తనాలు ఇస్తారు. విత్తనోత్పత్తి కింద సాగు చేసిన రకాల్లో ఎకరాకు 10–14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మంచి దిగుబడి వస్తే ఎకరాకు రూ.80 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశముంది. ఇక్కడి పంటను సీడ్ కంపెనీలు పంజాబ్, హర్యానా, రాజస్తాన్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు సరఫరా చేస్తాయి. అక్కడ పాడి గేదెలకు ఆహారంగా, పశుగ్రాసంగా ఇక్కడి విత్తనాలు ఉపయోగిస్తారు. ఏదైనా గ్రామంలో 50 శాతం మంది రైతులకు 10 క్వింటాళ్ల కంటే తక్కువ దిగుబడి వస్తే పది క్వింటాళ్ల వరకు రేటు చెల్లిస్తారు. అంతకంటే ఎక్కువ దిగుబడి వస్తే ఆ మేరకు ధర చెల్లిస్తారు.

మంచి ఆదాయం



పసుపు, మొక్కజొన్న పంట పూర్తయిన తర్వాత నువ్వు పంటకు ప్రత్యామ్నాయంగా సజ్జ పంటను మా ఊర్లోనే 300 ఎకరాల్లో సాగు చేస్తున్నాం. కంపెనీలు చెప్పిన మాదిరిగా అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తుండటంతో మంచి ఆదాయం వస్తుంది.

– మారు మురళీధర్‌రెడ్డి, వెల్లుల్ల, మెట్‌పల్లి

అనుకూల వాతావరణం



యాసంగిలో జగిత్యాల జిల్లాలో సజ్జ పంట విత్తనోత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు అంతగానం తక్కువ, ఎక్కువ కాకుండా ఉంటాయి. దీంతో పంట దిగుబడులు బాగా వస్తున్నాయి. రైతులకు మంచి ఆదాయం వస్తుంది.

– మిట్టపెల్లి రాజేశ్‌రెడ్డి, జగ్గాసాగర్, మెట్‌పల్లి